# శాస్త్రిగారి మాటలు

తెల్లవారితే ప్రభవనామ సంవత్సరం. ప్రకృతి అంతా చైత్ర వసంతుని ప్రణయ చుంబనాలతో తేలియాడింది. సుఖ నిద్ర నుండి మేలుకొన్నాను. ప్రక్కనున్న చెట్ల గుంపులో నుండి కోకిల కూ కూ యని మధుర కంఠంతో పాడింది.

ఇంతలో నా మిత్రుడు సూర్యారావు అక్కడికి వచ్చాడు. ఇక్కడ నా మిత్రుని విషయమై ఒక మాట చెప్పవలెను. ఆయన పొట్టివాడు చక్కని శరీరచ్ఛాయ. నేత్రములలో జీవకళ ఉట్టిపడుతుంటుంది. ఆ నేత్రములు అతని హృదయ నైర్మల్యమును, భావ గాంభీర్యమును బయలు పడుతాయి. ఆయన బ్రహ్మసమాజ మతస్థుడు. ఆయనకు మా యింట్లో చనుము ఆయనంటే మా కందరికి మిక్కిలి గౌరవము.

కాంతం వంట చేస్తున్నది. ఆవిడకు సహాయం చేయటానికి వచ్చిన మా వాళ్ల బాల వితంతువు సుబ్బమ్మ అక్కడే కూర్చుని సహాయం చేస్తున్నది. నేను, సూర్యారావుగారు గడపపైన ఒక మూల కూర్చున్నాము. కృష్ణమూర్తిగారు ఆగడపపైనే మరో ప్రక్కన కూర్చున్నారు. ఈ కృష్ణమూర్తిగారు ఎవరో నేను చెప్పనక్కరలేదు. వీరు పండితులు. ఆంగ్ల, ఆంధ్ర గీర్వాణ భాషలలో అసమాన పాండిత్యమును సంపాదించి, "ప్రాణేశ్వరి" యను మహా గ్రంథమును రచియించి ఇందిరాదేవిని పెండ్లాడి, ఆంధ్రలోకమున ప్రఖ్యాతి గాంచినవారు. వీరు అనేకమంది యువకులను ప్రోత్సహించి, సారస్వతాభిరుచి కలిగించినారు. మా ప్రక్కనే నా ప్రియ స్నేహితుడు శాస్త్రి కూర్చున్నాడు. అతడు కవి పండితుడు. చక్కని కవిత్వము చెపుతాడు. ఆయనను శాస్త్రి అని పిలుస్తాము. ఆయన మా యింటియందు చనువు కొంచెము తక్కువ. మేము ముగ్గురమును కూర్చున్నాము. ఏదో మాట్లాడుతున్నాము.

వంట కావటంతోనే మమ్ములను మడికట్టుకొమ్మని కాంతం కోరింది.

"కాంతమ్మగారూ, నేను ఎల్లప్పుడు మడితో నుంటానండి. నా మనోవృత్తులు కూడా ఎప్పుడు మడి కట్టుకొనే ప్రవర్తిస్తవి" అన్నారు కృష్ణమూర్తిగారు.

"మరిచిపోయినా, మీరుకూడా బ్రహ్మసమాజం చేస్తున్నారుగా యిప్పుడు, ఇందిరను పెండ్లాడిన దగ్గరనుండి, ఇందరిను పెండ్లాడటం ఇష్టమే కాని అదేమిటంటే కాస్త మడి, శుభ్రము ఉండవద్దూ"

"నేనిక్కడ ఉండంగానే మీరు అల్లా మాట్లాడటం? మడి అంటే ఏమిటండి? ఈ బట్టలు మలినంగా ఉంటే మీరు నన్ను యేమన్నా అనవచ్చు. మీ మామయ్య కట్టుకొనే మురికి కారుతున్న తగలేసినా తగలబడని నార పొత్తుపంచె కట్టుకుంటే మడా లేకపోతే మైలా" అన్నారు సూర్యారావుగారు.

"మీకు నేను జవాబు చెప్పలేను లెండి అన్నగారు. లేవండి భోజనం చేద్దాము" అన్నది కాంతం.

ముగ్గురం విస్తళ్ళ ముందు కూర్చున్నాము. అన్నము కలుపుకొనబోతున్న సమయంలో "ఉండండి ఉండండి వేపపూత పచ్చడి చేసి సిద్ధంగా ఉంచాను. కొంచెం తినండి" అన్నది కాంతం.

"ఏమండి సూర్యారావుగారూ వేపపూత పచ్చడిలోగల సిద్ధాంతమేమిటండీ" అన్నాను నేను. "సిద్ధాంతం లేదు. రాద్ధాంతం లేదు. కొంచెం నోట్లో వేసుకోండి. ఇంతలోకే ఏమి తప్పులేదు."

"వేపపూత పచ్చడి తింటేనేగాని మతం నిలబడదనే అభిప్రాయం మీరు ఇంకా మార్చుకోలేదండి" అన్నారు రావుగారు.

"ఆగండి, ఆగండి, ఇందులో ఒక గొప్ప అర్థమున్నది. జీవిత తత్వమంతా ఆచారంలో గుప్తమై ఉంది. మానవుడా! తీపి తినిన నోటనే, చేదు తినుము! ఈ రెండును నీ జీవితంలో ఉంటవి సుమా అని జ్ఞాపకం ఉంచుకో అని చెపుతుంది యీ ఆచారం. ఇట్లా పెట్టండి."

అని శాస్త్రి పెట్టించుకొని తిన్నాడు. కృష్ణమూర్తిగారు సూర్యారావుగారు పుచ్చుకోక, కోపంతో భోజనం ఆరంభించారు. నేను ఒకమాటు సూర్యారావుగారి వేపు మరొకసారి కాంతంవేపు చూచి, సూర్యారావుగారు చూడకుండా ఎడమచెయ్యి కాంతంవేపు చాపి కుడిచేత్తో అన్నం కలిపాను.

"ఈ రోజు ప్రకృతి అంతా ఆనందమయంగా ఉంటుంది గదండి, చేలు ఫలింప ధాన్యమంతయు ఇంటికి తెచ్చుకొని కర్షకుడు మహానందమొందు దినముగదా ఇది. పక్షులన్నియు కావలసినంత తిని హాయిగా పాటలు పాడు సమయము గాబోలు. ప్రతి ఇంటను మధుర పదార్థములను భుజింపుచు అనుభూత దుఃఖములను ఒక్కమారు మరచి భావిసౌఖ్యమునే తలంచి, నూతన వస్త్రధారణ మొనర్చి ఆనందించు

శుభదినము గదా ఇది. మా చిన్నతల్లి పుట్టి ఈ రోజుకు మూడు నెలలు. లోకమంతా సౌఖ్య సముద్రంలో మునిగి ఉంటుందనుకొంటూ" ఆ రోజున అన్నది కాంతం.

"కాంతమ్మగారూ, మీరు అన్నమాటలు బహు మంచివి, ప్రపంచమంతా ఆనందమయము. పరమాత్ముడు ఆనందమయుడు. ఆనందమే పరమాత్మ. ఆయన దయానిధి. అనంతుడు పరమదయానిధి. ఓ తండ్రీ నా పాపములను క్షమింపుము ఈ సుదినము, ఈ శుభోదయవేళ"

"అన్నగారూ, ఇది ప్రార్థనామందిరము కాదు. కొంచెం పరమాన్నం వేయమంటారూ?"

"ఇల్లా వేయండి. పరమాన్నం కూడా, పరమాత్మ స్వరూపము" అన్నారు కృష్ణమూర్తిగారు.

"మీకు ఎంత ఆనందము, ఎంత తృప్తిని ఇస్తున్నది ఈ రోజు. నా జీవితంలో సుఖం ఎరుగను. ప్రపంచమంతా ఆనందంలో ఉయ్యాలలూగు ఈ సుదినము నాకు దుఃఖనంజనకము. ఎందుచేతనంటారా, నాకు అనుభూత సుఖము లేదు. సౌఖ్యాగమమునకై ఎదురుచూచుట లేదు. దుఃఖము నా హృదయంలో వేళ్ళు పాతుకొని పోయినది. గడిపిన జీవనంలోను, గడవనున్న జీవనంలోను దుఃఖమే కాని సుఖము కనుపించదు. ఈ ప్రపంచకములో భౌతికంగా నాకు సంబంధించిన బాంధవ్యాలనుకోండి, పరిచయాలను కోండి అన్ని సడలిపోయినవే, కాని నాకేదో పరితాపము. ఎవరికొరకో వీధులవెంట చూస్తుంటాను. ఇదివరకు అట్లా చూచి కళ్ళు కాయలు కాచిపోయినవి. ఈ రోజునుండీ తిరిగి ఆదే మాదిరి విశాల ప్రపంచంవైపు చూస్తాను. నా దృక్కులు పోయి పోయి భౌతిక ప్రపంచమును దాటి తారా ప్రపంచమును దాటి ఓ పోతుంటాయి. వాటికి అంతులేదు."

"శాస్త్రిగారూ మీరు భోజనం చెయ్యండీ. కాంతం ఏ విధంగా కన్నీళ్ళు కారుస్తున్నదో చూడండి మీ విషాద చరిత్ర విని."

"అయ్యో విచారపడుతున్నారా అమ్మా ఎందుకు విచారపడతారు. ఇది నాకు విచార సమయం కాని మీకు కాదు. సోదరీ నీవు నూతన సంవత్సరమున అడుగు పెట్టబోవుచున్నావు. అమ్మా, నీపుత్రికా రత్నముయొక్క పవిత్ర మందహాసములు నీ హృదయమునకు పై శాంతి నొసగును. ఎంత మంది ఇట్టి సుఖములు లేక విదారించుచున్నారు. నూతనత్వముతో పొంగిపోవుచున్న ఈ వసంతోదయమున

హేమంతనిశీధిని యందు వలె భయకంపిత హృదయములలో కాలప్రవాహ తటాకమున కూర్చుండి శుభానందతోసీవ పులకితములై లోకమునకు నూతన సందేశమొనగు ఉగాదులవంకాదృష్టి మరల్చక భావి కష్టమార్గము వంక చూచుచూ ఊరక నిట్టూర్పులు విడుచు మానవు లెంతమంది లేరు? అట్టి వారికానంద మిచ్చుటకు నీవేమైనా జేసితివా? ఇదియే ఈ రోజున నీవు చేయ నిశ్చయించుకొనవలసినది" అన్నాడు శాస్త్రి.

"నేను చేయగల దేమున్నది. అదుగో మీ వలెనే నాకు 'ఎల్లకాల మమావాస్యయే' అని విలపించిన ఆయన ఇందిరాదేవిని పెండ్లాడి సుఖముగ నున్నాడు. ఆయనే మీకు ఆదర్శము" అన్నది కాంతం.

"జీవితము దుఃఖభూయిష్టము కాదు. శాస్త్రీ పరమేశ్వరుని ఉద్దేశము మానవుని సుఖపెట్టుటయే. ఆయన ఆనంద స్వరూపుడు. ఆనందో బ్రహ్మ" అని మొదలుపెట్టాడు సూర్యారావుగారు.

"అదుగో మళ్ళీ మీరు ప్రార్ధన మొదలుపెట్టారు. అన్నగారూ, కృష్ణమూర్తిగారు, చూడండి, ఎంత చక్కగా మాట్లాడకుండా భోజనం చేస్తున్నారో" అన్నది కాంతం.

"నేను భోజనం చేస్తున్నా నా ఆలోచన వేరుగా వుంది. శాస్త్రీ నీ మాటలు వింటే హృదయం కరిగిపోతుంది. నీ జీవితం విషయమై ఆలోచిస్తే గుండె పగిలిపోతుంది. మేము ఏమిచేయగలము శాస్త్రీ? నీ సంగతి విని పరితాపము పడతాముగాని యేమి చేయగలము. అయినను ఒక్క మాట విను. ఈ ప్రపంచంలో ఐడియల్‌గా జీవించుటం కష్టం – తెగిపోయిన ప్రేమ పాశాలను ఎక్కడి వక్కడే ముడివేసుకొంటూ జీవితాన్ని సాగించాలి. ఆ రాధామాధవునికి హృదయం అంకితం చెయ్యి శాస్త్రీ" అన్నాడు కృష్ణమూర్తిగారు.

"కాంతం, యీ రోజు సుదినము. చూచినారా ఎందరు లోకంలో కష్టాలలో మునిగి తేలుతున్నారో అందరు మనవలెనే సుఖించటం లేదు సుమా! భగవంతుడు మనకు ఆనందం యిచ్చినాడు. ఆ ఆనందామృతమును త్రావి మత్తిల్లకూడదు సుమా" అని నేనన్నాను.

మేము యింకా తింటున్నాము వాకిట్లో యెవరో ఒకరు తల్లీ ముద్దమ్మా అని అరచినాడు. "పోరా, ఇప్పుడేమిటి యింకా భోజనాలు కాలేదు. ఎవరు మీరు" అన్నది. "వాడు మాలోళ్ళమ్మ" అన్నాడు. "ఛా ఛా పో. మడి అన్నా విడువలేదు. నీకెట్లా పెడతాను" అన్నది.

"అదిగో ఏమండీ, ఇంతేనా పంచములు మానవులు కారా? మీరు మడి కట్టుకొన్నారురూ. వాడు ఆకలితో చస్తుంటే మనం చూస్తూ ఊరుకొందాము. కష్టంలో ఉన్నవారికి ఏదైనా సాయం చెయ్యవలెనన్న నీతిపాఠం ఇప్పుడే కదా నేర్చుకొన్నారు. అతన్ని పిలవండి. వేళకు కొంచెం అన్నం పెట్టండి. మీకు నిజంగా దేవుని యందు భక్తిప్రేమ వుంటే వాడిని భగవంతుడిగా భావించి పిలవండి."

"నారాయణమూర్తి అనేక రూపాలతో వస్తాడని శాస్త్రాలలో ఉందండి" అన్నాడు కృష్ణమూర్తిగారు.

"నేను పోయి వాడికి కొంచెం అన్నం పెట్టి వస్తాను" సూర్యారావుగారు లేవపోయినారు. వద్దు కూర్చోండి అని నేనన్నాను. కాంతం వేపు దీనంగా చూస్తూ, కాంతం ముఖం ముడుచుకొని కొంచెం అన్నం తీసుకొనిపోయి వాడికి పెట్టి పంపింది. తరువాత అంతా భోజనం చేసి వెళ్ళిపోయినారు.

శాస్త్రి జీవితకథ విని కన్నీళ్ళు పెట్టిన కాంతం ఇకనుంచి దయార్ద్ర దృష్టితో మానవసేవ చేస్తుందని నాకు ఆశ కలిగింది. ఇక మా జీవితాంబుధి నిర్మలంగా ఉంటుంది. పోట్లాటలుండవు. ఏకాభిప్రాయాలపై సుఖంగ జీవనము చేస్తాము అభిప్రాయ భేదం ఆదర్శనా భేదంవలన వస్తూవున్న కలహవరములకు ఇది తుదిరోజు అని మహానందంతో కాంతాన్ని సమీపించి కాంతం విన్నావు గదా శాస్త్రిగారి జీవిత కథ ఎటువంటి వాగ్ధోరణో చూచావా ఆయన మహానుభావుడు నా అదృష్టం వల్ల ఆయనకూ నాకూ స్నేహం కలిగింది అన్నాను. "ఏమిటో ఆయన గోల సుఖంగా మనమంతా నవ్వుతూ భోజనం చేస్తుంటే, ఆయన కాఏడ్పు ఏమిటి? ఏదో పద్యాలలో ఏడ్చారంటే, సరిపోయింది పోనీ అనుకోవచ్చు కాని ఎప్పుడూ అదే పనా? అయినా పండగపూట అటువంటి మనిషిని భోజనానికి పిలవటం ఎందుకూ?' అన్నది కాంతం. ఇంతలో సుబ్బమ్మ వచ్చి "ఏమండీ– ఆ బ్రహ్మ సమాజం ఆయన మాట్లాడిన మాటల్లో ఏమి తప్పులేదే. వాళ్ళకూ కాస్త దేవుడూ దైవమూ ఉన్నారు. బ్రహ్మసమాజమతం అంటే కిరస్తాని మతం అనుకొన్నానేను" అన్నది.

శాస్త్రిగారి మాటలు విని ఆయనయందు మా కాంతానికి యెంతో గౌరవం కలుగుతుందని ఆశపడ్డ నాకీమాటలు ఎంతో ఆశాభంగం కలిగించినా, గుటకలు మ్రింగి ఊరుకొన్నాను.

*(ఆంధ్రభారతి మాసపత్రిక, డిసెంబర్ 1927)*